క్లుప్తంగా

ఎమ్మిగనూరు చేరిన ఎల్లెల్సీ నీరు



ఎల్లెల్సీ వద్ద గంగపూజ చేస్తున్న డీఈలు, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర డ్యాం నుండి ఎల్లెల్సీకి విడుదల చేసిన నీరు గురువారం ఎమ్మిగనూరు సబ్‌డివిజన్‌కు చేరింది. గుడికల్ చెరువు వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఎల్లెల్సీ, మున్సిపల్ డీఈలు లక్ష్మణ్‌కుమార్, మనోహర్‌రెడ్డి నీటికి గంగపూజ చేశారు. ఎల్లెల్సీ ద్వారా వచ్చిన నీటిని మంచినీటి అవసరాలతో పాటు ఐఏబీ తీర్మానం మేరకు ఖరీఫ్ పంటలకు సరఫరా చేయనున్నట్లు డీఈ తెలిపారు. ఎల్లెల్సీ ఏఈలు రవి, మణికంఠ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, యూకే వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



పట్టుబడిన స్కూటర్లు, మద్యం, నాటుసారాను చూపుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన బోయబొంతిరాళ్ల గ్రామంలో గురువారం పత్తికొండ అర్బన్, రూరల్, వెల్దుర్తి సీఐలు రామకృష్ణారెడ్డి, మురళీకృష్ణ, యుగంధర్‌లతో కలిసి ఆయన కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. రామయ్య అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారా, మంకె పులికొండ వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 9 మద్యం టెట్రా ప్యాకెట్లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేని మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎస్‌ఐలు సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, భూపాలుడు, ఆయా స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలి

మద్దికెర: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ నాగభూషణం ఆదేశించారు. ఆయన గురువారం ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. బీఎల్‌ఓలు కొత్తగా ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్న వారి పూర్తి వివరాలను తెలుసుకొని, తగిన ధ్రువ పత్రాలు తీసుకుని ఓటరు జాబితాలో నమోదు చేయాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి అనే రైతుకు చెందిన వృషభం గురువారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. రైతు తన పొలంలో ఇనుప గొర్రుతో పొలం దున్నుతుండగా కరెంట్ స్తంభానికి పక్కనున్న స్టే వైర్‌కి ఎద్దు కాళ్లు తగిలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతుకు రూ.80 వేలు విలువ చేసే ఎద్దు మరణించడంతో దిక్కుతోచని స్థితిలో కన్నీటిపర్యంతమయ్యాడు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

6న ఉచిత వైద్య శిబిరం

తుగ్గలి: ఈనెల 6న పగిడిరాయి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆదెమ్మ, సర్పంచ్ సౌజన్య గురువారం తెలిపారు. కర్నూలు విశ్వభారతి వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి వైద్యులు వైద్య చికిత్సలందిస్తారని వివరించారు.

మహిళ అనుమానాస్పద మృతి

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో వడ్ల నారాయణమ్మ (55) అనే వితంతువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాలు.. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న నారాయణమ్మ కొంతకాలంగా అనారోగ్యం (దగ్గు, ఆయసం)తో బాధపడుతోంది. ఈ నెల 1వ తేదీన వితంతు పింఛన్ తీసుకుంది. ఈ స్థితిలో గురువారం గ్రామానికి చెందిన తెలుగు మహేష్ ఆమెకు గ్యాస్ట్రిక్ సిరప్ ఇవ్వడానికి ఇంటికి వెళ్లగా ఆమె మృతి చెంది ఉన్నట్లు గుర్తించాడు. ఇరుగుపొరుగు వారికి విషయం తెలిపాడు. మృతురాలి తమ్ముడు వడ్ల పంపన్న ఆచారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తిమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందవరం: మండల కేంద్రానికి చెందిన బోయ ఒంటెద్దు జయరాముడు (35) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలు.. గత నెల 30వ తేదీ రాత్రి జయరాముడు స్కూటర్‌పై ఎమ్మిగనూరు నుంచి నందవరానికి వస్తూ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కర్నూలులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య బోయ తలారి తులసమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



నందవరానికి చెందిన మహాలక్ష్మికి భర్త అకాల మరణం పొందాడు. కుటుంబ భారమంతా ఆమె పైనే. మగ్గం ఆడితే తప్పా ఇంటిల్లిపాదికి మూడుపూటలా బువ్వ పెట్టే పరిస్థితి లేదు. అలాంటి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పాలన వరమైంది. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షలు సాయం పొందింది. అమ్మఒడి ద్వారా ఏటా రూ.15 వేలు పొందుతూ పిల్లలను చదివిస్తోంది. నెలనెలా వితంతు పెన్షన్‌ను ప్రభుత్వం 1వ తేదీనే అందిస్తోంది. మోడుబారిన మగ్గం బతుకులకు సంక్షేమ రంగులు అద్దిన మహానుభావుడు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అంటూ మహాలక్ష్మి మహానందంతో చెబుతోంది.

ఈమె పేరు టి.లక్ష్మి. నందవరం మండలం నాగలదిన్నె గ్రామం. జగనన్న నేతన్న నేస్తం లబ్ధిదారురాలు. ఏటా రూ.24 వేలు చేనేత సాయం పొందుతోంది. గత పాలకుల యేలుబడిలో చేనేత బతుకులు ఛిద్రమయ్యాయని, చాలామంది వృత్తిని వదిలేసి హోటళ్లు, అంగళ్లలో కూలీ పనుల్లో చేరారని తెలిపింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేనేతల్లో మార్పు వచ్చింది. నేతన్న నేస్తం, చేనేత పెన్షన్లు అందిస్తున్నారు. క్లస్టర్ల ద్వారా సబ్సిడీతో నూలు, యార్న్ దొరుకుతున్నాయి. నేసిన చీరలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. నాలుగేళ్లలోనే చేనేతల్లో ఇంత మార్పు తెచ్చిన ముఖ్యమంత్రి మరోమారు అధికారం చేపడితే చేనేతల్లో శాశ్వత వెలుగులొస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



చేనేతకు మంచి రోజులు

- నేతన్న నేస్తం ద్వారా నియోజకవర్గంలో ఏటా రూ.4.77 కోట్లు సాయం
- ఐదేళ్లుగా సాయం పొందుతున్న చేనేత కార్మికులు
- ఐదేళ్లలో రూ.23.8 కోట్లు నేతన్నల అకౌంట్లలో జమ
- క్లస్టర్ల ద్వారా నైపుణ్య శిక్షణ



మగ్గంపై వస్త్రం నేస్తున్న కార్మికుడు

ఎమ్మిగనూరు: ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా అణగారిన చేనేత బతుకులను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి చేయూతనిచ్చేందుకు సంకల్పించారు. చేనేత కార్మికుల కోసం నాలుగేళ్లుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని మేలు ఇప్పుడు చేస్తున్నారు. బడ్జెట్‌లో చేనేతల కోసం ప్రత్యేకంగా రూ.200 కోట్లు కేటాయించి సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. నేతన్న నేస్తం ద్వారా అర్హులైన చేనేత కుటుంబాలకు ఏటా రూ.24 వేలు చొప్పున వారి అకౌంట్లలోనే జమచేస్తుండటంతో నేతన్నల జీవితాల్లో భరోసా ఏర్పడింది. నియోజకవర్గంలో 1988 చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ద్వారా రూ.4.77 కోట్లు అందుతున్నాయి. ఇక చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తూ ఆదుకుంటున్నారు. 1449 మందికి ప్రతినెలా రూ.39.84 లక్షలు పెన్షన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తోంది.

గత పాలకుల ప్రాపకం ఇలా..

అగ్గిపెట్టెలో చీరను ఇమర్చే నైపుణ్యం ఒకప్పుడు ఎమ్మిగనూరు చేనేతల సొంతం. ఇక్కడి చీరలు అంతర్జాతీయ ఖ్యాతిని పొందాయి. మారుతున్న సంస్కృతి, పాశ్చాత్య సంప్రదాయాల మూలంగా చేనేతలకు ఆదరణ తగ్గింది. వారి సంక్షేమార్థం నెలకొల్పిన సంఘాలు, క్లస్టర్లు సైతం అవినీతి ఊబిలో కూరుకుపోయాయి. మాటల గారడితో చేనేతలను ఐదేళ్లు మభ్యపెట్టిన గత పాలకులు పలాయనం చిత్తగించారు. నేసిన నూలు చీరలకు గిట్టుబాటు దక్కక చేనేతలు గద్వాల పట్టు చీరలవైపు మొగ్గుచూపారు. గద్వాల చీరలకు వన్నెలద్ది గిట్టుబాటు సరిచూసుకుంటున్న తరుణంలో ముడి సరుకు అందడం ఆగిపోయింది. దీంతో తిరిగి వెనక్కి చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యమైన పట్టును అందించి చీరలను నేయించుకునే మాస్టర్ వీవర్స్ కాలానుగుణంగా నాణ్యత లేని (టెస్టెడ్) జెరిని అందిస్తున్నారు. ఈ చీరను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తే వచ్చే రూ. 800 కూలి రూ.400లకు పడిపోయింది. చేనేతలు తామె ముడి సరుకును తీసుకొని తయారు చేసిన చీరలను మాస్టర్ వీవర్స్ వద్ద విక్రయానికి పోతే తక్కువ ధరకు కొనుగోలు చేసి చేనేతల కష్టాన్ని కాజేసేవారు.

ప్రభుత్వ చేయూత

చేనేతల స్థితిగతుల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుర్తింపు పొందిన చేనేత కార్మికులకు యేటా రూ.24 వేలు ఆర్థిక చేయూత అందిస్తోంది. జిల్లాలో చేనేత కుటుంబాలు అధికంగా ఉన్న ఒక్క ఎమ్మిగనూరు మున్సిపాలిటీలోనే 2021–22లో 1388 మందికి రూ.24 వేలు చొప్పున మొత్తం రూ.3.33 కోట్లు జమ అయ్యాయి. 2022–23లో 1493 మందికి రూ.3.58 కోట్లు , అంతకుముందు రెండేళ్లు చేనేత–జౌళిశాఖ ద్వారా నేరుగా చేనేతల ఖాతాల్లో జమ అయ్యాయి. ఇటీవల ఐదో విడత కింద రూ.4.77 కోట్లు చేనేతల అకౌంట్లో జమయ్యాయి. ఒక్క ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనే ఐదేళ్లలో రూ.23.8 కోట్లు నేతన్నల అకౌంట్లో జమకావటం విశేషం. నందవరం, గోనెగండ్ల మండలాల్లోని చేనేతలకు నేతన్న నేస్తం సహాయమందుతోంది. చేనేతలకు ప్రత్యేకంగా ఆరోగ్య గుర్తింపు కార్డులు మంజూరు చేయడం, చేనేత ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు చేపట్టింది. చేనేతల కోసం రూ.200 కోట్లతో ప్రత్యేక వార్షిక బడ్జెట్ రూపొందించడం, చేనేత కార్మికులకు సున్నా వడ్డీ రుణాలు అందించే ఏర్పాట్లు చేసింది. అదేవిధంగా చేనేత సంఘాల పటిష్టతకు, ఆర్థిక పరిపక్వతకు చర్యలు తీసుకుంది.

నైపుణ్య శిక్షణ.. రాయితీ పరికరాలు:

చేనేత క్లస్టర్ల ద్వారా కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధునిక డిజైన్లపై అవగాహన కల్పిస్తారు. డిజైన్లు ఎలా తయారు చేయాలి, ఏ డిజన్లు ఏఏ మార్కెట్లో ఎక్కువ రేట్లకు అమ్ముడుపోతాయి, అందులో వినియోగించాల్సిన మెటీరియల్ (నూలు, పట్టు, జరీ) వంటి అంశాలపై 45 రోజులపాటు చేనేత కార్మికులకు శిక్షణ ఏర్పాటు చేస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికులకు ఆధునిక మగ్గాల నేత కోసం మెటీరియల్ కొనుగోలుకు 90 శాతం సబ్సిడీ ఇస్తారు. నేతన్నలు నైపుణ్యం పెంచుకొనేందుకు, వ్యాపార సరళిలో వినూత్న ప్రయోగాలకు ఇది కలిసోస్తుంది.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చేనేతలకు అందిన సాయం

మండలం	నేతన్న నేస్తం లబ్ధిదారులు	యేటా పొందే సాయం(రూ.కోట్లలో)	పింఛన్ లబ్ధిదారులు	ప్రతినెల పొందేసాయం (రూ.లక్షల్లో)
మున్సిపాలిటీ	1,493	3,58,32,000	1076	29,59,000
ఎమ్మిగనూరు	239	57,36,000	155	4,26,250
నందవరం	218	52,32,000	175	4,81,250
గోనెగండ్ల	38	9,12,000	48	1,32,000
మొత్తం	1,988	4,77,12,000	1454	39,98,500

జగనన్న చేయూత మరువలేం



రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సాయం అంతకుముందున్న పాలకులు చేసి ఉంటే చేనేతలు ఎప్పుడో బాగుపడేవారు. చేనేత పింఛన్ కింద నెలనెలా రూ.2,750 వస్తున్నాయి. నా భార్య మల్లేశ్వరికి నేతన్న నేస్తంతో ప్రతి సంవత్సరం రూ.24 వేలు వస్తున్నాయి. బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేస్తున్నాయి. జగనన్న ప్రభుత్వంలో చేనేతలు అదృష్టం చేసుకున్నారు. గతంలో హోటల్‌లో సర్వర్‌గా పనిచేసేవాడ్ని. జగనన్న వచ్చాక మళ్లీ మగ్గం పట్టా. – కునిగిరి మల్లికార్జున, చేనేత పింఛన్‌దారుడు

నేతన్న నేస్తం తోడైంది



చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం తోడుగా నిలుస్తోంది. నాలుగేళ్లుగా జగనన్న ఇచ్చే సొమ్ముతో ముడిసరుకులు కొని మగ్గం వేస్తూ కుటుంబాలను గట్టెక్కిస్తున్నాం. తిండికి కూడా ఇబ్బంది పడిన కరోనా కాలంలో సాయం చేసిన ముఖ్యమంత్రి జగనన్నను ఎన్నటికీ మరువలేం. – కామర్తి లక్ష్మి, పెద్దమర్రివీడు

వివాహిత ఆత్మహత్య

పత్తికొండ టౌన్: పత్తికొండ పట్టణం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మహాదేవి(36) గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మహాదేవి భర్త బాలరాజు అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతిచెందాడు. కుమారుడు భరత్ స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. మహాదేవి కూలీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన మహాదేవి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పత్తికొండ సీఐ మురళీమోహన్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: అలువాల గ్రామానికి చెందిన బడే సావలి గురువారం ఉదయం కర్ణాటక మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా గ్రామ శివారులోని పెద్దనేలటూర్ రోడ్డు వద్ద పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.తిమ్మారెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 960 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

5 ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ బసాపురం గ్రామం సమీపంలో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి గురువారం రాత్రి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ట్రాక్టర్లు, జేసీబీని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నందవరం: మండలంలోని గురజాల గ్రామంలో కురువ రామన్న, మాచాపురం గ్రామంలో చాకలి సుభద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను గురజాల ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నరసింహులు, సచివాలయ కన్వీనర్ శివ చేతుల మీదుగా అందజేశారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

వేదావతి నీటిని అందించాలి

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టు ద్వారా ఆస్పరి మండలానికి నీటిని అందించాలని డిమాండ్‌చేస్తూ గురువారం ఆస్పరి సచివాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ ఆస్పరికి మండలానికి ఒక్క నీటి ప్రాజెక్టు కూడా లేదన్నారు. వేదావతి ప్రాజెక్టు ద్వారా మండలానికి సాగు, తాగు నీటికి అందించాలని ఈఓ రామాంజనేయులుకు వారు వినతి పత్రం ఇచ్చారు.

రూ.కోట్లతో నిర్మించిన రోడ్లు కనిపించవా?



ఎమ్మిగనూరు 25వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అభివృద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సెల్ఫీ ఛాలెంజ్ అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తే ఎవరూ నమ్మే స్థితిలో లేరని ఎర్రకోట జగన్ అన్నారు. కోట్లాది నిధులతో నిర్మించిన రోడ్లు ఆయనకు కనిపించవా అని ప్రశ్నించారు. పట్టణంలోని వెంకటాపురం, లక్ష్మణ్‌థియేటర్ కాలనీకి, సోగనూరు రోడ్డు, హెచ్‌బీఎస్ కాలనీలోని ఎల్‌ఐసీ కార్యాలయం మీదుగా రూ.4.50 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించినట్లు వివరించారు. ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణానికి మరో రూ.4.5 కోట్లతో టెండర్లు పిలిచినట్లు చెప్పారు. టీడీపీ హయాంలో ఆయన నివాసం ఉండే ప్రాంతంతో పాటు పట్టణంలో ఎక్కడా రోడ్లు నిర్మించని మాజీ ఎమ్మెల్యే ఇప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజా సంక్షేమం

ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు ఇన్‌చార్జ్ కేఎస్ శివన్నతో కలిసి పట్టణంలోని 25వ వార్డు లక్ష్మణ్‌టాకీస్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలుచేస్తూ సీఎం జగనన్న నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమచేస్తున్నారన్నారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరగా తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ డీఈ నీరజ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, నజీర్‌అహమ్మద్, శివప్రసాద్, బజారి, అమాన్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గ్రాండ్ సక్సెస్

గత నెల ఒకటవ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాల్లో సురక్ష శిబిరాలు నిర్వహించి 93.5 లక్షలకు పైగా ప్రజల నుంచి అభ్యర్థనలు రాగా అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న 98 శాతం మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సర్టిఫికెట్ల ద్వారా అర్హులై ఉండి మిగిలి పోయిన వారికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు సముచిత స్థానం



తుగ్గలిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: బడుగు, బలహీనవర్గాలకు అన్ని విధాలుగా న్యాయం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండలో ఆమె మాట్లాడుతూ.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు సీఎంపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ నాయకులకు ఎన్నికల సమయంలోనే బీసీలు గుర్తుకొస్తారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బీటీ నాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. బీసీ కార్డుతో 40 ఏళ్లుగా రాజకీయాలు చేస్తున్న కేఈ కుటుంబం ఇతర కులాలను ఎదగకుండా అడ్డుకున్న చరిత్ర అందరికీ తెలుసన్నారు. గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న కేఈ కృష్ణమూర్తి పత్తికొండ నియోజకవర్గానికి, బీసీలకు చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం వర్గాల మధ్య చిచ్చు పెట్టడం ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆ పార్టీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంత్రివర్గ పదవుల్లో 50 శాతానికి పైగా ఇవ్వడంతో పాటు, ప్రభుత్వ, పార్టీ పదవుల్లో వారికి అగ్రపీఠం వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. టీడీపీ నాయకుల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

తుగ్గలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల మతాలు, ప్రాంతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కొనియాడారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సింగిల్ విండో అధ్యక్షురాలు విజయలక్ష్మి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర రెడ్డి, అధికారులు, వలంటీర్లతో కలిసి రెండో రోజు తుగ్గలిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీదేవి ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

సురక్షతో సుపరిపాలన..

దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమం సక్సెస్ అయ్యిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే అవసరం, పైసా ఖర్చు లేకుండా సులభంగా సర్టిఫికెట్లు పొందే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. నెల రోజుల పాటు నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో నియోజకవర్గంలో 36,032 ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లోనూ ఓటమి తప్పదన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని, వారి ఆశీర్వాదంతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. అంతకుముందు వెన్నెముక ఆపరేషన్ చేయించుకుని వచ్చిన జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస రెడ్డి, రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్, మోహన్‌రెడ్డి, రామచంద్ర, నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



దేవబెట్టలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ

నందవరం: మాతాశిశు సంరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, సర్పంచ్ శివన్న పేర్కొన్నారు. గురువారం ముగతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-4, గంగవరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వారి చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గర్భిణులలో రక్తహీనత నివారణ, ఆరోగ్యకరమైన శిశువు జననం కోసం సంపూర్ణ పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

అమ్మ పాలు అమృతం

అమ్మ పాలు అమృతమని పెద్దకొత్తిలి గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న అన్నారు. గురువారం గంగవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ముర్రుపాలు పట్టడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: ప్రసవమైన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రీతి పేర్కొన్నారు. గురువారం దేవబెట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట, బోయనపల్లెల్లో టేక్ హోమ్ రేషన్ కిట్ల పంపిణీ, తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ పి ల్యాక్, సర్పంచ్ నిర్మల, సూపర్‌వైజర్లు కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఇందిరానగర్ 19, 20వ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు కౌన్సిలర్ పూజేశ్వరి పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం–1లో సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఉప సర్పంచ్ సులోచనమ్మ, ఎంపీటీసీ నామాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

హాలహర్వి: ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఏపీడీ పక్కీరప్ప, ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని బాపురం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీ బ్లాక్ ప్లాంటు పథకం కింద మాజీ సర్పంచ్ గుండన్నస్వామి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ మేరకు ఏపీడీ, ఏపీఓ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, నాయకులు నాగేంద్ర, ఎంపీటీసీ పాల్‌రెడ్డి, పార్థు, మల్లికార్జున పాల్గొన్నారు.

అనంతపురం వెళ్లి పింఛన్ పంపిణీ

తుగ్గలి: మండల పరిధిలోని రాతనకు చెందిన కలగంటి రంగమ్మ వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో ఆరు నెలలుగా అనంతపురంలో రెండో కుమారుడు చంద్ర వద్ద ఉంటోంది. నెలనెలా రాతనకు వచ్చి పింఛన్ తీసుకోవడం కష్టమైంది. దీంతో వలంటీర్ వీరప్రతాప్ గురువారం అనంతపురం వెళ్లి రంగమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేసి ఆమె దీవెనలు అందుకున్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కేంద్రం కుట్రలు



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఎం ఆధ్వర్యంలో ఆదోని నుంచి చేపట్టిన మహాపాదయాత్ర గురువారం ఎమ్మిగనూరుకు చేరింది. స్థానిక సోమప్ప సర్కిల్ వద్ద పాదయాత్రలో ఆయన మాట్లాడారు. రాయలసీమ వెనుకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల: మండలంలో తాగు, సాగు నీటి వసతిని కల్పించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా నాయకుడు ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర గురువారం సాయంత్రం గోనెగండ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం ద్వారా మండల రైతాంగానికి సాగునీరు అందించడంతో పాటు దాహార్తిని తీర్చాలన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై బైఠాయించి మహిళ నిరసన



చంటి బిడ్డలతో నిరసన చేపట్టిన జంగం విద్య

చిప్పగిరి: కుటుంబ ఉమ్మడి ఆస్తిని పెదనాన్న, చిన్నాన్న ఆక్రమించుకున్నారని, తనకు రావాల్సిన వాటా ఇప్పించి న్యాయం చేయాలని ఓ మహిళ స్థానిక అంబేడ్కర్ కూడలిలో చంటి బిడ్డలతో నిరసనకు దిగింది. వివరాలు.. మండలంలోని కాజీపురం గ్రామానికి చెందిన మురళీధర్ స్వామి ఒక్కగానొక్క కూతురు జంగం దివ్యకు మంత్రాలయంకు చెందిన విజయ్‌కుమార్‌తో వివాహం జరిపించారు. కొంతకాలానికి ఆమె తండ్రి మరణించాడు. ఈ క్రమంలో గురువారం న్యాయం కోసం నడిరోడ్డుపై బైఠాయించింది. ఆమె మాట్లాడుతూ.. తమ కుటుంబానికి సర్వే నంబర్లు 22, 110ఎ, 8బీలో మొత్తం 24 ఎకరాల పొలం ఉందని, తన పెదనాన్న, చిన్నాన్నలకు వాటాలు పోగా తండ్రి భాగం కింద తనకు రావాల్సిన 8 ఎకరాలు ఇవ్వకుండా వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రావాల్సిన భూమి దక్కకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయింది. ఘటనపై తహసీల్దారును వివరణ కోరగా ఆర్ఓఆర్ కింద విచారణ జరిపి ఆర్డీఓకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఆర్డీఓ సూచనల మేరకు సమస్యను పరిష్కరిస్తామన్నారు.